# ఆశాజ్యోతి

శ్రీమతి వి. జ్యోతి రమణశ్రీ

తెల్లవారుఝాము ఐదు గంటలు కావస్తోంది.

"పిన్నీ! లే. లే. అమ్మమ్మ తొందరగా లేవమంటోంది. మేమంతా ఎప్పుడో లేచిపోయాంగా. నువ్వేలేట్‌లేట్."

బద్ధకంగా ఉందని అటు, ఇటు తిరిగి పడుకుంటున్నా, కుదిపి కుదిపి లేపేస్తున్నారు అక్కయ్య పిల్లలు చిట్టి, చిన్నీను. బాబిగాడైతే నా కాళ్ళమీద ఎక్కికూచొని, చేతులు రెండూ పట్టుకొని తన వైపుకు లాగేస్తున్నాడు.

నాదస్వరం కేసెట్ ఆన్ చేసి, టేప్‌రికార్డర్ వాల్యూమ్ హెచ్చించి మంచం ప్రక్కనే ఉన్న టేబిలు మీద పెట్టింది చెల్లాయి. వీళ్ళంతా ఇంత హంగామా చేస్తుంటే ఇక లేవక తప్పదురా భగవంతుడా అనుకుంటూ బద్ధకంగా లేచాను.

కళ్ళు విప్పానో లేదో ఒక్క ఉరుకున దగ్గరగా వచ్చి – బావగార్ని అల్లరి పెట్టి నిద్రలేపే కార్యక్రమాన్ని నా చెవిలో చెప్పసాగింది చెల్లాయి.

అంతలో "మరదల్లారా! అంటూ మా బావే వచ్చేశారు. (మా ఇద్దర్నీ కలిపి "మరదళ్ళల్లారా" అనటానికి బదులు మమ్మల్ని మా బావ పిలిచే జంటపేరు అది.) మీ తంత్రాంగానికి ముందే నేను లేచి వచ్చాను. మీ అక్క పిలుస్తోంది. తొందరగా పదండి" అంటూ మా బావే టపాకాయలా పేలాడు.

రాత్రి పడుకోబోయే ముందు ఎంతో వేగంగా లేవాలని, లేస్తూనే బావను ఆట పట్టిస్తూ నిద్రలేపాలని ఎన్నో పథకాలు వేసుకొని పడుకున్నాం మేమిద్దరం కాని, మా ప్లాన్ అంతా తలక్రిందులయింది నా మొద్దు నిద్రను, బద్ధకాన్ని తిట్టుకున్నాను మనసులోనే.

"చిన్నక్క లేవటం ఆలస్యం చేసింది గానీ– అంతలో ఏమయిందిలే బావా! ఇంకా ఇవాళ నరక చతుర్దశే కదా!" సీమటపాకాయలా పేలింది చెల్లాయి.

అందరం కలసి పూజ గదిలోకి చేరేసరికి అమ్మ అందరికీ పీటలు వేసి హారతి ఇవ్వటానికి అన్నీ సిద్ధం చేసింది. ఇంకా ఇలాంటి సరదాలు, సందళ్ళూ ఎందరి ఇళ్ళల్లో మిగిలి ఉన్నాయోగాని, నవ్వుల జల్లులతో మనసులు పులకింత లేస్తుంటే, పిల్లలు మనుమలు, మనుమరాళ్ళతో పాటు భర్తని కూడా కూచోబెట్టి అందరి తలలపై నూనె పెట్టి, కుంకుమ బొట్లు, నలుగు పిండి నుదుట పెట్టి మా అందరికీ హారతి ఇచ్చింది అమ్మ.

నోట్లో పటికబెల్లం ముక్కలు పెట్టగానే, నాన్న ఓ ఇత్తడి పళ్ళెన్ని అప్పడాల కఱ్ఱతో బాదుతూ, జేగంటలా వాయించాడు. "నరకాసురుడు చచ్చాడోహో" అని ఓ సారి పెద్దగా అరిచారు నాన్న జేగంటతో సహా పిల్లలంతా ఉత్సాహంతో అదేమాట తిరిగి అనగానే – నవ్వుల జేగంటలు మార్మోగాయి.

"ఇక ఒకొక్కళ్ళూ స్నానాలకు కదలండి" అంది అమ్మ. ఒక్కొక్కరు తలంటు కొంటూంటే "తలకో టపాకాయ" కాల్చమని చెప్పారు నాన్న.

పది గంటలు అయ్యేసరికి అందరి తలంట్లూ ఫలహార కార్యక్రమాలూ పూర్తి అయ్యాయి.

అమ్మ, వదిన, అక్కయ్య కలసి వంట – పిండి వంటల పని ప్రారంభించారు. భావ, అన్నయ్య, తమ్ముడు చెల్లాయి కలసి మార్నింగ్ షో సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. పిల్లలందరితో కలసి బజారు ప్రోగ్రాం నాది!

సాయంత్రం వేళ బజార్లో అడుగు పెట్టటానికే వీలు లేనంత కోలాహలంగా ఉంటుందని ఉదయాన్నే అక్కయ్య పిల్లలు, అన్నయ్య పిల్లలు అందర్నీ తీసుకొని ముందుగుండు సామాన్లు కొనటానికి బయల్దేరాను. కాని, అందరూ నాలాగే అనుకున్నారో ఏమో! వంద పెళ్ళిళ్ళు ఒకే పందిట్లో జరుగు తున్నంత సందడిగా ఉంది బజారు. దుకాణాలన్నీ రక రకాలుగా అలంకరించి ఉన్నాయి. ఎన్నో రకాల బాణ సంచారాలు చక్కని వరుసల్లో దొంతర్లుగా పేర్చి, కనువిందుగా అమర్చారు. బారులు బారులుగా ఉన్న దుకాణాలు వచ్చే పోయే వారికి స్వాగతాలు పలుకుతున్నాయి. బొమ్మల కొలువులు పెట్టినట్టుగా మట్టి బొమ్మల దుకాణాలు బజారుకే ప్రత్యేక ఆకర్షణ కలిగిస్తున్నాయి.

చిట్టి, చిన్న బొమ్మల దుకాణాల వైపు పరుగు లెత్తారు. మున్ని, బాబిగాడు మిఠాయి దుకాణం వైపు వెళ్ళారు. పంచదారతో చేసిన చార్మినార్, కుతుబ్ మీనార్ గొల్లభామల బొమ్మలు చూపిస్తూ –" అత్తా! కొనుక్కుందామా" అంటోంది అన్న కూతురు జయ.

"నాకు మాత్రం పెద్దగన్ కొనాలి. రీలు కేపులు బోల్డు కావాలి" మరోసారి డిమాండ్ చేశాడు అన్నయ్య చిన్న కొడుకు వినయ్. అందర్నీ ఒప్పించి మళ్ళీ దగ్గరకు చేర్చుకున్నాను.

"అమ్మా! నా దగ్గర సామాన్లు కొనండి. ఈ సిసింద్రీలతో తారాజువ్వలు కూడా పోటీ పడలేవు. నా దగ్గరున్న చుచ్చుబుడ్లు కంపెనీ మెరుగు బుడ్లు లాంటివి కావు. మువ్వన్నెలు చిందించే చుచ్చుబుడ్లు ఉన్నాయి. మందార పువ్వుల్లా విచ్చుకొని పై పైకి వెలుగులు జిమ్మేవీ ఉన్నాయి. వెన్నెల వెల్లువల్లా వెలుగులు వెదజల్లే మతాబులు ఉన్నాయి. కొనండమ్మ కొనండి".

రెండు భుజాలకు బరువైన నిండు సంచులు వ్రేలాడేసుకొని, ఒక పట్టెడకు చెక్కకట్టి దాన్ని మెడలో వ్రేలాడేసుకొని, అందులో కొన్ని మతాబులు, చుచ్చుబుడ్లు, చిచింద్రీలు పెట్టుకున్న నిండా పదేళ్ళు ఉండని ఆపసివాణ్ణి చూస్తూండి పోయాన్నేను.

వాణ్ణి చూస్తూంటే జాలేసింది. చినుగుల బనీను, అతుకుల పొట్టిలాగు వేసుకున్నా వాని మొఖంలో అదో రకమైన వెలుగు నిండి ఉంది. ఆశగా నా సమాధానం కోసం ఎదురు చూస్తున్నాడు. "ఏంటమ్మా అలా చూస్తారు? ఈ పిల్లాడేంటి? అమ్మడం ఏమిటి? అనా? పెద్ద పెద్ద షాపుల్లోనే మీలాంటి పెద్ద వాళ్ళంతా కొనేస్తే నాలాంటి చిన్న వాళ్ళు చేసిన ఈ బాణసంచారా ఏలుగులు ఎవరికి తెలుస్తాయి? ఎలా పైకి వస్తాయి. ఏడాదికి ఒక్క అమావాస్యకే మన దేశంలో వెలుగులు విరుస్తాయి. ఆ వెలుగుల్లో నా చేతి వంతు ఎంతైనదీ మీలాంటి వాళ్ళే నిర్ణయించాలి. కొని తీసుకు వెళ్ళండి. ఈ రోజు రెండు కాల్చి చూడండి – నచ్చకపోతే నేనిక్కడే ఈ బజార్లోనే తిరుగుతూంటాను. తిరిగి ఇచ్చేయండి". ఆఖరిమాట అంటూన్నప్పుడు వాడి గొంతు తడబడింది. వాడి కనుకొలుకుల్లో నిలిచిన నీటిపొర స్పష్టంగా కనిపించింది.

వాడి దగ్గరున్న రకాలన్నిటినీ కొన్ని కొన్ని చొప్పున కొనేశాను. దగ్గర దగ్గర అరవై రూపాయలు అయింది. వందనోటు చూపించి చిల్లర అడిగాను. లేదన్నాడు. చిల్లర కోసం మిఠాయి దుకాణం వైపు నడిచాను. నా వెనకే వచ్చాడు వాడు కూడా.

పిల్లలందరితో పాటు వాడికీ ఒక లడ్డు, జహంగీరు ఇప్పించాను. ఎంతో చెప్పిన మీదట తీసుకున్నాడు. క్రింద పడిఉన్న చిన్న కాగితాన్ని తీసి తొడుక్కున్న బనీనుతో తుడిచి లడ్డు అందులో చుట్టి సంచిలో వేసుకున్నాడు. జహంగీరు మాత్రం తిన్నాడు.

ఎటో చూస్తున్నట్టు నటిస్తున్నా నేను మాత్రం వాడినే గమనిస్తున్నాను. ఒక్కసారి మా ఇద్దరి చూపులూ కలిశాయి.

"మా చెల్లికండీ! ఇంతే ఉంటుంది అది" అంటూ ఏదో తప్పు పని చేసిన వాడిలాగ అన్నాడు మా జయను చూపిస్తూ.

"మీదే బోణీ! ఇక ఇవికూడా చెల్లి పోతే రేపు సాయంత్రం మార్వాడీ పేటలో లక్ష్మీ గణేష్ పూజలు జరిగే దగ్గర అమ్మకానికి బుంగలు, బూరాలు కొనుక్కొని వెళిపోతాను" అన్నాడు.

"అన్నీ అమ్మేస్తే మరినువ్వు కాల్చుకోవా?" అమాయకంగా అడిగాడు మా బాబిగాడు.

"రోజూ కడుపులు మాడ్చుకొని బ్రతికే మాకు మతాబులు కాల్చుకొనే రోజులు ఎప్పుడు వస్తాయో"! అన్నాడు ముందు నుంచి గమనిస్తున్నాను వాడి మాటల్లోని తీరు తెన్నుల్ని. ఇంత చిన్న వయస్సులో ఇన్నిన్ని మాటలు ఎలా చెప్పకలుగుతున్నాడు? ఆశ్చర్య పోయాన్నేను.

నా మనసులోని భావం ఎలా కనిపెట్టాడో గాని– "అవసరం అన్నీ నేర్పిస్తుంది. దాన్నే గురువుగా భావిస్తే మంచి దారి చూపిస్తుంది ఇవన్ని నేనే తయారు చేశాను. మా అమ్మ పని చేస్తున్న ఇంటివారి అబ్బాయిలు ఇద్దర్నీ బ్రతిమాలుకొని నేర్చుకున్నాను. నాలాగ మా చెల్లి కష్టబడకూడదు అది పెద్దయ్యేలోగా నేను ఎక్కడయినా పనిలో కుదురు కుంటాను. ఏమంటారు?" నన్నే ఎదురు ప్రశ్న వేశాడు.

"రేపు గాలి బుడగలు, బూరాలు అమ్మితే నీకెంత లాభం వస్తుంది?" అని అడిగాను.

"కొన్నవన్నీ అమ్ముడయితే, పది రూపాయల దాకా లాభం రావచ్చు. కాని ముందు ఇవి చెల్లాలిగా". వాడి గొంతులో నిరాశతో కూడిన దీనత్వం తొణికిస లాడింది. ఆశ– నిరాశల మధ్య వాని కనురెప్పలు కదలాడుతున్నాయి.

"రేపు సాయంత్రం నువ్వు ఇక్కడే ఉండు – నేను వచ్చేదాకా" అన్నాను.

నామాట అర్థం కాక అదోలా చూశాడు. చివరకు ఏమనుకున్నాడో ఏమో అలాగే అన్నట్టుగ్గా తల ఊపాడు.

ఒకేదగ్గర ఇంతసేపు ఉండటం నచ్చలేదేమో – మున్ని, బాబి, చిట్టి అటు వెళ్దాం పదమని మారాం చేశారు.

బజారు గేటు ప్రక్కన నలుగురు పిల్లలతో ఆగిన స్కూటరును చూచి అటు కదిలాడువాడు. పిల్లలు దిగగానే స్కూటరు స్టాండు వేస్తున్న అతని దగ్గర చేరాడు క్షణంలో.

దీపావళి రోజు. సంధ్యవేళ దాటి పోయింది. వీధుల్లో అన్ని ఇళ్ళూ దీపాల వరుసలతో కళకళ లాడుతున్నాయి. ఎలక్ట్రికల్ బల్బుల తోరణాలు దారంతా ఎదురవుతున్నాయి. పైకెగసిన బాణసంచారా విశాల ఆకాశంలో రంగుల రంగవల్లులు దిద్దుతున్నై.

ఇంత ఆలస్యం అయినందుకు ఇంట్లో అంతా ఎంతో కంగారు పడుతుంటారని అనుకొంటూనే ఇల్లు చేరాను. క్రొత్త నిక్కరు, చొక్కా తొడుక్కొని నాతో కలసి వచ్చిన అబ్బాయిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వాడి గురించి నేను తెలుసుకున్న విషయాలు చెప్తుంటే ఒక్కొక్కరూ నా చుట్టూ చేరారు.

"వీడిపేరు రాజు గౌరవ మర్యాదలు గల ఓ మంచి కుటుంబంలో ఇద్దరు అక్కయ్యలకు, ఒక అన్నకు ముద్దుల తమ్మునిగా, అమ్మా నాన్నలకు బుజ్జిబాబుగా ఐదేళ్ల వరకు పెరిగాడు. రాజమండ్రి దగ్గర ఓ పల్లెలో ఉండేవారు. అక్కడి బడిలో జాయిన్ అయ్యాడు. ఆ సంవత్సరమే గోదావరీ వరదల్లో వీళ్ళ కుటుంబమంతా నాశనమైపోయింది. తల్లి కొడుకు మాత్రం మిగిలారు.

ఆ పరిస్థితుల్లో తమలాగే కుటుంబమంతా నాశనమై అనాథగా మిగిలిన ఓ చూలింత– వీళ్ళమ్మ ఆదరణలో ప్రాణం నిలుపుకొని ఓ పాపను ప్రసవించింది. ఆ తర్వాత రెండు నెలలకే ఆమె అనారోగ్యంతో కన్ను మూసింది.

ఇప్పుడు ఆ పాపే తన చెల్లిగా, అమ్మే దైవంగా భావిస్తూ, వాళ్ళిద్దరి సుఖం కోసం ఈ చిన్న వయసులోనే కష్టపడుతున్నాడు రాజు.

మీరందరూ ఇష్టపడితే ఇవాల్టినుంచి మనతోనే ఉంటూ, మన ఇంట్లో అవసరమైన చిన్న చిన్న పనులను చేస్తూ, మీతోపాటు ఆడుకొంటూ ఉంటాడు. అలా కాకపోతే ఇవాళ మనతో సరదాగా గడిపి రేపు తెల్లవారి వాళ్ళింటికి వెళ్ళిపోతాడు"

ఎవరికీ చెప్పకుండాసాయంత్రం నేను ఎక్కడికి వెళ్ళానో తెలియక, తిరిగి రావటానికి చేసిన ఆలస్యంవల్ల ఇంత వరకు దీపాలు పెట్టకుండా, దుబ్బు కొట్టకుండా ఎదురు చూస్తున్న ఇంట్లోని వారంతా ఒక్కసారి నెవ్వెర పోయారు.

"అమ్మా! ఈ అబ్బాయి స్వంతంగా చేసిన మతాబులు, చుచ్చుబుడ్లు... అవే నిన్న సాయంత్రం మేం కొనుకొచ్చాం" అన్నాడు మున్ని.

దీపావళికి చీర కొనుక్కోకుండా కూతురు చేసిన పని ఏమిటో అర్థం అయింది అమ్మకు

"ఇంటి ముంగిట ముచ్చటగా దీపాలు వెలిగించు కొని

పటాసులు ప్రేల్చటమేకాదు– దీపావళి
నిరాశా, వేదనల గూళ్ళలో బతుకుతూన్న
నికృష్ట జీవనాలలో
ఆశాజ్యోతులు వెలిగిస్తే
అదే అసలైన దీపావళి!"

అన్నారు నాన్న కవితా రీతిలో. అమ్మా నాన్నల ఆమోదం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఆ క్షణం రాజు కళ్లల్లో వెలిగిన సంతోషదీపాల కాంతి రేఖలు చూచిమరపురాని దీపావళి ఇదేనని తృప్తిగా గాలి పీల్చేను. □

